క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గండేపల్లి: గండేపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగనుంది. ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షత వహిస్తారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

అగ్ని బాధితులకు ఎంపీపీ సాయం



శృంగధారలో బాధితులకు నగదు అందజేస్తున్న ఎంపీపీ రాజుబాబు

శంఖవరం: శృంగధార గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ఎంపీపీ పర్వత రాజుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను సాయం అందించారు. బాధితులు కాబోజు శ్రీను, తుంపాటి అర్జున్, పండు సింహాద్రికి బియ్యం, నగదు, కిరణా, వంట సామగ్రి అందజేశారు. సర్పంచ్ గుండు చెంచుబాబు, ఈగల విజయదుర్గ, నాయకులు పర్వత జానకీదేవి, పర్వత వివేక్, డేవిడ్‌రాజ్, పాకల రాజు, మాదాసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాసా వితరణ

రౌతులపూడి: శెట్టిబలిజపేటలో ఇటీవల పెంకుటింట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు నాసా స్వచ్ఛంద సేవా సంస్థ మంగళవారం సాయం అందించింది. బాధిత కుటుంబాలకు బియ్యం, వంట సామగ్రి, దుస్తులు అందించారు. నాసా ప్రతినిధులు బత్తిన అప్పారావు, ఎం.పార్వతి, వెంకటేష్, దొరబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గోకవరం: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 44వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామికి కల్యాణం జరిపించారు. భారీ అన్నదానం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు.


బ్యాడ్మింటన్‌లో జగన్నాథ్ విశేష ప్రతిభ



తునిలో జగన్నాథ్‌కు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

తుని: రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన ఏపీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తుని పట్టణానికి చెందిన క్రీడాకారుడు పడాల శ్రీవెంకట జగన్నాథ్ ప్రతిభ కనబర్చి పతకాలు సొంతం చేసుకున్నాడు. ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి–2024 పోటీల్లో జగన్నాథ్ 45ప్లస్ డబుల్స్‌లో జిల్లాకు చెందిన దాసరి సునీల్‌కుమార్‌తో కలిసి ప్రథమ స్థానం సాధించాడు. 45ప్లస్ పురుషుల సింగిల్స్‌లో ద్వితీయ స్థానం, నెల్లూరు జిల్లాకు చెందిన కోనే శారదతో కలిసి 45ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ద్వితీయ స్థానం సాధించాడు. మార్చి 16 హర్యానా రాష్ట్రం పంచకులలో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు అర్హత సాధించాడు. అతడిని తుని రాజా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు కె.సూరిబాబు, పోలిశెట్టి భరత్, జట్ల భవానీశంకర్‌తో పాటు పలువురు ప్రముఖులు మంగళవారం స్థానిక క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

రథసారథులు వలంటీర్లే..



కాండ్రేగులలో వలంటీర్లను సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేసిన నేతలు

జగ్గంపేట: మండలంలోని కాండ్రేగుల, గుర్రంపాలెం గ్రామాల్లోని సచివాలయాల్లో వలంటీర్లను సత్కరించే కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం ముఖ్యఅతిథిగా విచ్చేసి, వలంటీర్లకు సేవారత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించి, ప్రశంసా పత్రాలు, బ్యాడ్జీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పరిపాలనకు రథసారథులు వలంటీర్లేనని అభినందించారు. రాష్ట్రంలో అవినీతి రహిత, పారదర్శక పాలనకు వలంటీర్లు ప్రధాన సూత్రధారులన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సర్పంచ్ బొదిరెడ్డి చక్రరావు, గుర్రంపాలెం సర్పంచ్ చీపురుపల్లి లక్ష్మి, వైస్ ఎంపీపీ నక్కా శ్రీను, చీపురుపల్లి రాఘవ, వరుపుల సూరిబాబు, అబ్బిరెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తొండంగి: బెండపూడి శివారులో సారా తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. శంఖవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన పెరమల్లకోవెల జోగేంద్ర స్కూటీపై 70 లీటర్ల సారాను తరలిస్తుండంగా, దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి రూ.17,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

జగన్ పాలనలోనే మహిళల ఆర్థికాభివృద్ధి

- జెడ్పీ వైస్ చైర్మన్ పద్మలత, వైస్ ఎంపీపీ గంగబాబు
- డ్వాక్రా మహిళలకు రూ.12.09 కోట్ల ఆసరా చెక్కు అందజేత



తొండంగిలో నమూనా చెక్కును అందజేస్తున్న మేరుగు పద్మలత, నాగం గంగబాబు

తొండంగి: పేద, మధ్య తరగతి ప్రజల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమైందని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో 1,481 మహిళా సమాఖ్య సంఘాలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.12.09 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలకు ఎన్నికల ముందు రుణామాఫీ చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను మాఫీ చేయడంతో పాటు, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు అమలు చేశారన్నారు. ఆయా పథకాల వల్ల పేద, మధ్య తరగతికి చెందిన ఎందరో మహిళలు వ్యాపారాలు చేసుకుంటూ, కుటుంబ పోషణ చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఇంటికీ నవరత్నాలతో పాటు, ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక లబ్ధి పొందారని గుర్తు చేశారు. మంత్రి దాడిశెట్టి రాజా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. ఈ సంక్షేమ పాలన నిరాటంకంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని, మంత్రి దాడిశెట్టి రాజాను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, తొండంగి సర్పంచ్ సోమల ప్రసాద్, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్, పార్టీ నాయకులు దడాల విజయబాబు, అంగుశూరి సుశీలరాణి, అరుమిల్లి ఏసు బాబు, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అడ్డాల సూర్యకాంతం, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వై.సత్తిబాబు, సీసీలు, వీఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే సీఎం జగన్ లక్ష్యం

వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం



తామరాడలో రోగులకు కిట్లు అందిస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: రాష్ట్రంలో సంపూర్ణ ప్రజారోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. తామరాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్పంచ్ తోట అయ్యన్న అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి తోట నరసింహం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ప్రధాన లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఇంటి వద్దకే ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు వివరించారు. నాడు–నేడులో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆధునిక సాంకేతిక ఆరోగ్య యంత్రాలతో ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైద్యులు పి.రవికుమార్ పలువురికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, నాయకులు పెదిరెడ్డి లక్ష్మణ్, కె.సాయి, ఓలేటి రాజు, అడబాల సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

కిర్లంపూడి: రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. కృష్ణవరంలో మంగళవారం సర్పంచ్ గొరకపూడి వీరఅనంతలక్ష్మి అధ్యక్షతన పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి తోట నరసింహం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పొరుగు రాష్ట్రాలకూ ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావటం తథ్యమన్నారు. ప్రస్తుతం అమలు అవుతున్న పథకాలతో పాటు, మరిన్ని అమలు చేయాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, తోట బాబ్జీ, గొరకపూడి గోపీనాథ్, అడబాల వెంకటేశ్వరరావు, ఉంగరాల సత్యనారాయణ, బోనగిరి కాశి, పెంటపాటి శ్రేష్ఠి, సేనాపతి పద్మరాజు, ఓలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

వేళంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. వేళంగి గ్రామంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. వైద్యులు రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మేకల సత్యనారాయణ, మండల కన్వీనర్ నరాల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వత జానకీదేవి, పర్వత వివేక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ముఖ్యమంత్రి కావాలని పూజలు

యాగంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల



పూర్ణాహుతిలో పాల్గొన్న వరుపుల సుబ్బారావు, ఇతర నాయకులు

అన్నవరం: రాష్ట్రాన్ని అన్ని విధాలా ప్రగతి పథంలో నడిపిస్తూ, పేదల కోసం రూ.లక్షల కోట్లతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో విజయ దుందుభి మోగించి, మరలా ముఖ్యమంత్రి కావాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు స్థానిక గ్రామ శివార్లలోని గోశాల వద్ద గల ఉచ్ఛిష్ట గణపతి మహాకాళీ శక్తిపీఠంలో మంగళవారం పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలు గెలవాలని కోరినట్టు ఆయన తెలిపారు. పీఠంలో లోక కల్యాణార్థం గణపతికి పది రోజులుగా నాగాభట్ల రవిశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్ష మోదక (ఉండ్రాళ్ల) హవన యాగం పూర్ణాహుతి భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వరుపుల సుబ్బారావు హాజరయ్యారు. పది రోజుల్లో లక్షా పదివేల ఉండ్రాళ్ల హోమంలో వేసినట్టు నాగాభట్ల రవిశర్మ ఆయనకు తెలిపారు. కరువు కాటకాలు లేకుండా, దేశం సుభిక్షంగా ఉండాలని ఈ యాగం నిర్వహించామని తెలిపారు. పూర్ణాహుతిలో దేవస్థాన వైదిక సలహాదారు, కల్యాణబ్రహ్మ నాగాభట్ల కామేశ్వర శర్మ, 20 మంది రుత్విక్కులు ఈ యాగం నిర్వహించారు. వరుపుల వెంట ఎంపీటీసీ దడాల సతీష్, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, పార్టీ నాయకులు పర్వత వివేక్, కొండపల్లి అప్పారావు, కొల్లు చిన్నా, బలువు రాంబాబు తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు



ఎన్నికల రూట్ ఆఫీసర్లకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు రూట్ ఆఫీసర్లు సన్నద్ధంగా ఉండాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల రూట్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలలతో పాటు ఏలేశ్వరం నగర పంచాయతీలను 31 రూట్లుగా విభజించినట్టు చెప్పారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రూట్ ఆఫీసర్లు ఎన్నికల సంఘ నిబంధనల మేరకు విధులను నిర్వర్తించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో, ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన, ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో పోలీస్ శాఖ పటిష్టమైన జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. తుది జాబితా విడుదలైనా, ఎన్నికల సంఘ నిబంధనల మేరకు నామినేషన్ల చివరి రోజు వరకూ ఓటు నమోదుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. ప్రత్తిపాడు మినర్వా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని తరలించడంలో రూట్ ఆఫీసర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలపై అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ గణేష్ అవగాహన కల్పించారు. అనంతరం ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల అధికారి శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఏలేశ్వరం, శంఖవరం తహసీల్దార్లు వై రంగారావు, వి రాజకుమారి, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి శ్రీనివాసరావుతో పాటు, 31 మంది రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పూర్ణిమ

గండేపల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞకురూ సమష్టి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల సమాఖ్య భవనంలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలన, వాటి చట్టాలు, బాలికల హక్కులు తదితర అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ బాల్యంలో వివాహాలు చేయడం వల్ల బాలికలు వివిధ రకాల అనారోగ్య, శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యుక్త వయస్సులో గర్భం దాల్చడం వల్ల శిశువుకు, తల్లికి అపాయకరమని వివరించారు. సమాజంలో పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే స్త్రీ, శిశు సంక్షేమ శాఖను సంప్రదించాలన్నారు. బాలికల సమస్యలు, చట్టాలు, సురక్షిత–అసురక్షిత స్పర్శ, వేధింపులకు గురైన బాలికల లక్షణాలు తదితర విషయాలపై కౌన్సిలర్ దుర్గారాణి వివరించారు. బాల్య వివాహాలు జరిగితే 1098 చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని లీగల్ అధికారి ఎం సుధాకర్ కోరారు. బాల్య వివాహాలు జరిపితే బాధ్యులకు రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సన్యాసిరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కరీమున్నిసా తదితరులు పాల్గొన్నారు.

తిరోగమనంలో దేశ పురోగతి

జగ్గంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ పురోగతిని తిరోగమనం వైపు తీసుకువెళుతోందని జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ విమర్శించారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ఇప్పుడు మోదీ గ్యారంటీ అంటున్నారని ఎద్దేవా చేశారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగన్ లక్ష్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు



మండపంలో వరుపుల సుబ్బారావుకు హారతులిస్తున్న మహిళలు

శంఖవరం: పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మంగళవారం మండపం గ్రామంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, స్థానిక నేతలతో కలిసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతి పక్షాల నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ, ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచ్‌లు కూనిశెట్టి మాణిక్యం, ఈగల విజయదుర్గ, సకురు గుర్రాజు, ఎంపీటీసీ దడాల సతీష్ నాయకులు పాలం వెంకటరత్నం, పాలం చంటి, గింజాల కొండబాబు, కొండపల్లి అప్పారావు, వెలుగుల రాంబాబు, దూడల శివ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

ప్రత్తిపాడు: సమాజం కోసం పాటుపడే జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు హామీ ఇచ్చారు. స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులే ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. సమాజంలో నెలకొన్న సమస్యలను నిష్పక్షపాతంగా పత్రికల్లో ప్రచురించడం వల్ల, వాటి పరిష్కారానికి మీడియా వేదికవుతోందని చెప్పారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరం, శంఖవరం పర్వత రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు వాసిరెడ్డి జమీల్, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, అడపా సోమేష్, మలకల వేణు, శిడగం రాజేశ్వరరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థతో ఇంటి ముంగిటకే పథకాలు

ఎమ్మెల్సీ అనంతబాబు, కోఆర్డినేటర్ వరుపుల



ఏలేశ్వరంలో వలంటీర్‌కు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, కో ఆర్డినేటర్ వరుపుల

ఏలేశ్వరం: వలంటీర్ వ్యవస్థలో ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు చేరాయని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను వారు అందజేశారు. అర్బన్ పరిధిలో ఐదుగురికి సేవారత్న, 130 మందికి సేవామిత్ర, రూరల్ పరిధిలో ఒకరికి సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న, 290 మందికి సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రతి లబ్ధిదారుడి ఇళ్ల వద్దకే పథకాలు వచ్చాయన్నారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా, పాలన కొనసాగింపులో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ప్రతి లబ్ధిదారుడికి వలంటీర్ల ద్వారా సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివప్రసాద్, మండల కన్వీనర్ అడపా పార్థసారథి, బదిరెడ్డి గోవిందు, ఓలేటి చంటిబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గణేష్

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుద్దా గణేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో మంగళవారం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌ను గణేష్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. గణేష్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు. తనకు ఈ పదవి ఇచ్చిన ఎమ్మెల్సీ అనంతబాబు, కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, జువ్విన వీర్రాజు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



పోతులూరులో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. పోతులూరులో రూ.1.19 కోట్ల జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన మంచినీటి ట్యాంకును ఆయన మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్‌జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు అందిస్తారన్నారు. మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు ఆధ్వర్యంలో ప్రజలు భారీ గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బర్ల చక్రం, మాజీ ఎంపీటీసీ నాగులాపల్లి బాబ్జి, వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై సత్యదేవుని ఊరేగింపు



సత్యదేవుడు, అమ్మవారిని గరుడ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం రాత్రి సత్యదేవుడు, అనంత లక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లను వెండి గరుడ వాహనంపై అన్నవర పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. రత్నగిరి నుంచి మెట్ల మార్గాన రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తొలిపాంచా వద్దకు తీసుకువచ్చి, అక్కడ పూజలు చేశారు. గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి, గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు సుధీర్, గాడేపల్లి పవన్, ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, సూపరింటెండెంట్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

ఏలేశ్వరం: భీష్మ ఏకాదశి సందర్భంగా స్థానిక శివాలయంలో వైఎస్సార్ సీపీ నేత, కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు ఆర్థిక సహకారంతో ఆలయాన్ని అలంకరించారు. గోవిందు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఉపాలయానికి భక్తుల తాకిడి నెలకొంది. దిబ్బలపాలెంలోని కోదండ రామాలయంలో ఏకాహం నిర్వహించారు.

తుని రూరల్: ఎస్.అన్నవరంలో పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. కుమ్మరిలోవలో ఉన్న తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. హెచ్.కొత్తూరు, తేటగుంట, టి.తిమ్మాపురం, డి.పోలవరం, ఎన్.సూరవరంలో భక్తులు భీష్మ ఏకాదశిని జరుపుకొన్నారు.

తంటికొండలో..

గోకవరం: భీష్మ ఏకాదశి సందర్భంగా తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకవరంలోని ఆర్టీసీ బస్టాండ్, పోస్టల్ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద స్వామివారి కళ్యాణోత్సవాలు జరిగాయి. స్వామివారిని పల్లకీలో ఊరేగించారు.

గండేపల్లి: పలు దేవాలయాల్లో స్వామివారికి వార్షిక కల్యాణం నిర్వహించారు. తాళ్లూరు శివాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు.

పాండవుల తీర్థం ప్రారంభం

గోకవరం: రంపయర్రంపాలెంలో పాండవుల మెట్ట వద్ద మంగళవారం పాండవుల తీర్థం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు భారీగా భక్తులు తరలివచ్చి, కొండపై గుహల్లో ఉన్న పాండవులు, ద్రౌపదీదేవికి పూజలు నిర్వహించారు. కొండ దిగువన శ్రీకృష్ణుని ఆలయంలో పూజలు జరిపారు. ఆలయం వద్ద భారీ అన్నదానం జరిగింది. ఐదు రోజుల పాటు తీర్థం కొనసాగుతుంది.